స్వప్నం సాకారమయ్యేనా..!

- కలగా మిగులుతున్న 30 పడకల ఆసుపత్రి
- ప్రథమ చికిత్సలకే పరిమితమవుతున్న పీహెచ్‌సీ
- మెరుగైన వైద్యం అందక ప్రజలకు ఇక్కట్లు
- ఎన్నికల హామీ అమలుపై శ్రద్ధ చూపని ప్రజాప్రతినిధులు


నల్లజర్ల పీహెచ్‌సీ

నల్లజర్ల: మెరుగైన వైద్యం నల్లజర్ల పరిసర గ్రామాల ప్రజలకు కలగానే మిగిలిపోతోంది. ఈ ప్రాంతంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. అందుకు అనుగుణంగా నల్లజర్ల పీహెచ్‌సీ స్థాయిని పెంచడం లేదు. విజయవాడ - విశాఖపట్నం మధ్య 16వ నంబర్ జాతీయ రహదారి ఈ మండలంలోని ఏడు గ్రామాలకు చేరువగా సాగుతుంది. ఈ బైపాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతూ విలువైన ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. చనిపోయిన వారు చనిపోతున్నారు. కనీసం మొదటి గంటలో వైద్యం అందితే క్షతగాత్రుల్లో కొంత మందినైనా రక్షించగలుగుతారు. కొన్ని సందర్భాల్లో 108, హైవే అంబులెన్సులు ప్రమాద స్థలానికి చేరుకునే లోపే తీవ్రంగా గాయపడిన వారు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇతర వాహనాల్లో ఆసుపత్రికి తరలించే అవకాశం ఉన్నా అవగాహన లేక స్థానికులు.. కళ్ల ముందే కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా బంధువులు, స్నేహితులు నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేస్తామని, 30 పడకల ఆసుపత్రిగా నిర్మిస్తామని, దీనికి నిధులు మంజూరయ్యాయని గత అక్టోబరు నెలలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ పరిసర ప్రాంతాలతో కలిపి ఇక్కడే 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన ఈ మాట చెప్పి అప్పుడే ఐదు నెలలవుతోంది. నిధులు మంజూరయ్యాయని చెప్పినా.. 30 పడకల ఆసుపత్రి దిశగా ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

ప్రయోజనాలెన్నో..

నల్లజర్ల పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత ప్రజలతో పాటు రహదారి ప్రమాద బాధితులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకూ ప్రథమ చికిత్సలకే పరిమితమైన ఈ వైద్య శాలలో అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. గుండె, ఎముకలు, ఇతర శస్త్ర చికిత్సల నిపుణులు అందుబాటులో ఉంటారు. 24 గంటలూ వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉంటారు. పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడతాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని నల్లజర్ల పీహెచ్‌సీని వెంటనే 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

సమయం పట్టేలా ఉంది



పీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. 30 పడకల ఆసుపత్రి మంజూరైనట్లు ఎటువంటి ఆదేశాలూ రాలేదు. కొంత సమయం పట్టేలా ఉంది. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో శాసన సభ్యులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ స్థలం చాలకపోతే మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలం తీసుకునే అవకాశం ఉంది.

– గంగాధరరావు, పీహెచ్‌సీ డాక్టర్, నల్లజర్ల

వెంటనే అప్‌గ్రేడ్ చేయాలి



మూడు నాలుగేళ్లుగా బైపాస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షతగాత్రులను, మృతులను తరలించడానికి మా సంస్థకున్న రెండు వాహనాలు సమకూర్చుతున్నాం. అయినప్పటికీ ఒక్కోసారి ఇబ్బందికరంగా ఉంటోంది. నల్లజర్లలో పెద్ద ఆసుపత్రి ఉంటే ప్రమాదాలు జరిగినా ప్రాణ నష్టం అంతగా ఉండదు. ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి ఆసుపత్రి ఏర్పాటు చేయాలి.

– భోగవల్లి వెంకట సుబ్బారావు, మండల చైర్మన్, మానవత సంస్థ

చెట్లు నరికివేస్తున్న అక్రమార్కులు


పోలవరం కాలువ గట్టుపై చెట్టు మోడు

నల్లజర్ల: పోలవరం కాలువ గట్లు అక్రమార్కులకు అడ్డాగా మారాయి. నిన్నటి వరకూ మట్టి తరలించుకుపోయిన దుండగుల కళ్లు నేడు కుడి కాలువ గట్లపై పెరుగుతున్న చెట్లపై పడింది. నిత్యం రెండు మూడు ట్రాక్టర్ల కలపను నరికి తరలించుకుపోతున్నారు. ఈవిధంగా ఒక్కో ట్రాక్టరుకు 10 టన్నుల చొప్పున ఒక్కో ట్రక్కుకు రూ.30 వేల వరకూ సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. కాలువ గట్లపై నీటి పారుదల శాఖ వేప, తుమ్మ, చింత వంటి ఖరీదైన చెట్లను పెంచింది. ఇప్పుడిప్పుడే అవి పెరిగి పెద్దవయ్యాయి. వర్జీనియా పొగాకు క్యూరింగ్‌కు ప్రస్తుతం కలప అవసరం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో దుండగులు రాత్రి వేళల్లో కటింగ్ మెషీన్ల సాయంతో మొదలు వరకూ చెట్లు నరికి తీసుకుపోతున్నారు. వీరవల్లి టోల్‌ప్లాజా నుంచి సింగరాజుపాలెం శివారు వరకూ ఈ చెట్ల నరికివేత జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు దృష్టికి తీసుకుని రాగా అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

19 నుంచి సప్త సప్తాహం

నల్లజర్ల: స్థానిక రామకృష్ణ భక్త మందిరంలో ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకూ 49 రోజుల పాటు సప్త సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించనున్నట్టు రామకృష్ణ భక్త సమాజం తెలిపింది. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 9న సప్తాహం ముగింపు సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకం, విశేష పూజలు, గంగాసిందూరపూజ, పాశుపత మహామంత్ర హోమం నిర్వహిస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉండ్రాజవరం: పాలంగి 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కోసం మండలంలోని పాలంగి, చివటం, కె.సావరం గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తారని చెప్పారు.

దేవరపల్లి: యర్నగూడెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ యర్నగూడెం ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. యర్నగూడెం ఇండస్ట్రియల్ ఫీడర్‌పై ఉన్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

కొవ్వూరు: ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట ఘటనకు బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తక్షణమే రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు వస్తున్నారని తెలిసి కూడా ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రత్యేక రైళ్లకు ఒక్కో టిక్కెట్ రూ.1500 చొప్పున అమ్మడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ఆదాయం కోసమే రైల్వే శాఖ పని చేస్తుందని విమర్శించారు. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు రక్షణ కల్పించడంలో రైల్వే శాఖ విఫలమైందన్నారు. క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తాడిమళ్లలో బిలాల్ మసీదు ప్రారంభం


తాడిమళ్లలో మసీదు ప్రారంభించాక ముస్లింలతో మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన బిలాల్ మసీదును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ముస్లింలు నమాజులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి ఎండీ బాషా, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, ముస్లిం నాయకులు షేక్ మీరా సాహెబ్, ఆలీషా, షేక్ మదీనా, రాజా సాహెబ్ (రంజాన్), షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జైన్ మందిరానికి శంకుస్థాపన

నిడదవోలు: నూతన జైన్ మందిరం నిర్మాణానికి స్థానిక పాత పంగిడిరోడ్‌లో ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారు. నిడదవోలు జైన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం ఏర్పాటు

కొవ్వూరు: భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షురాలిగా డేగల సునీత, ప్రధాన కార్యదర్శులుగా కోడూరి సతీష్, కడియం వెంకటరత్నం, ఉపాధ్యక్షులుగా గొరిజాల గంగధర్, గోపిశెట్టి శ్రీనివాస్, చెక్క శ్రీనివాస్, చొటుపల్లి బాబ్జీ, కార్యదర్శులుగా వీరాబత్తుల మణికంఠ, జొన్నకూటి రాజు, యంగల సోమరాజు, యాగంటి ప్రదీప్, కడిమి విజయలక్ష్మి, కోశాధికారిగా చాపర్ల హిమబిందులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

కరాటే పోటీలలో పతకాలు

రాజమహేంద్రవరం రూరల్: ఫోర్త్ ఇంటర్ స్టేట్ గుజూరియో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో కవలగొయ్యి గ్రామానికి చెందిన ఏడుగురు చిన్నారులు బంగారు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని కోచ్ పంచికట్ల శ్రీనివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. భవిష్యత్తులో చిన్నారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఓట్లు దండుకుని కూటమి నేతల మోసం


నిడదవోలులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమేష్, యువజనులు

నిడదవోలు: రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ, టీచర్ పోస్టుల భర్తీ, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ హామీలిచ్చి కూటమి నేతలు మోసం చేశారని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తాళ్లూరి రమేష్ విమర్శించారు. ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలు దాటుతున్నా హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. పట్టణంలో ఆదివారం రమేష్‌కు మద్దతుగా పార్టీలు, యూనియన్లకతీతంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రమేష్‌కు ఓటు వేసి గెలిపించాలని విద్యార్థులు, నిరుద్యోగులు ప్రచారం నిర్వహించారు. యువజనులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రమేష్‌కు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


కొవ్వూరు పట్టణ నూతన కార్యవర్గంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

కొవ్వూరు: భారతీయ జనతా పార్టీ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో పట్టణ శాఖ నూతన అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా తురగ విజయభాస్కరరావు, ఉపాధ్యక్షులుగా చెరుకూరి సాయిరాజు, పసల పూడి అరుణ, పల్లా సత్తిబాబు, సెక్రటరీలుగా బాలదారి చక్రపాణి, గోవింద రాణాప్రతాప్, జె.రాజ్‌కమల్, ఆర్.వెంకటలక్ష్మి, పిక్కి అంజలి ఎన్నికయ్యారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా మల్లవరపు కృష్ణ, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడిగా అడ్డూరి సత్యనారాయణలను ఎన్నుకున్నట్లు సందీప్‌కుమార్ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఈ ఎన్నికకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నీరుకోండ సూర్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ మాట్లా వీరాంజనేయులు, కో–కన్వీనర్ బీవీ ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పునరుత్పాదక వనరులు వినియోగిద్దాం


వాక్‌థాన్‌లో పాల్గొన్న ఓఎన్‌జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్, ఉద్యోగులు

- ఓఎన్‌జీసీ అసెట్ ఈడీ శాంతానుదాస్
- ఉత్సాహంగా వాక్‌థాన్

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ అనుకూల పరిశుభ్రమైన పునరుత్పాదక వనరులను వినియోగించుకుంటూ భావితరాలను కాపాడుకుందామని ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. హరిత, స్వచ్ఛమైన శక్తి ద్వారా పరిశుభ్రమైన పర్యావరణాన్ని సాధిద్దామనే అనే నినాదంతో ఆదివారం గెయిల్ కార్యాలయం నుంచి ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల వినియోగం పెరుగుతుండడంతో భవిష్యత్తులో వాటి కొరత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ ఇంధన వనరులశాఖ 2030 నాటికి 500 గెగావాట్ల పునరుత్పాదక ఇంధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ఓఎన్‌జీసీ పది మెగా వాట్ల ఇంధన సామర్థ్యాన్ని పెంచుకుంటుందన్నారు. రాజమండ్రి ఎసెట్ పరిధిలోని తాటిపాకలో ఇప్పటికే సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పర్యావరణ అనుకూల ఇంధన వినియోగంలో భాగంగా పవన విద్యుత్తును కూడా వినియోగంలోకి త్వరలో తీసుకు వస్తున్నట్లు తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు అసెట్ పరిధిలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ ఉద్యోగులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


వేగేశ్వరపురంలో బాధితుడు యేసుకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన దారం యేసు వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మండల ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు తన స్నేహితులు సహకారంతో బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3500 సమకూర్చాడు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో కె.నాగేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు కన్నీటి వీడ్కోలు

- అనారోగ్యంతో మృతి చెందిన రాజబాబు
- అంతిమ యాత్రలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు
- కుటుంబ సభ్యులకు పరామర్శ


రాజబాబు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, మార్గాని భరత్‌రామ్ తదితరులు


చెలికాని రాజబాబు (ఫైల్)

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చెలికాని రాజమోహన్‌రావు (రాజబాబు) (80) ద్వారకా తిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలోని తన నివాసంలో శనివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఆయనను స్వగ్రామానికి తీసుకు వచ్చారు. కొద్దిసేపటికే రాజబాబు మృతి చెందారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ హోం మంత్రి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి తోట రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రతాపనేని వాసుబాబు, బొండాడ వెంకన్నబాబు, జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ కారుమంచి రమేష్ తదితరులు రాజబాబు పార్థివ దేహాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో నేతలు పాల్గొని రాజబాబుకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజబాబు మరణం వైఎస్సార్ సీపీకి, ఈ ప్రాంతానికి తీరని లోటని ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు అన్నారు. పార్టీకి నియోజకవర్గంలో పెద్ద దిక్కును కోల్పోయామని పేర్కొన్నారు. నాలుగు మండలాల నుంచీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


గాడి వెంకటేశ్వరరావు మృతదేహం

నిడదవోలు: శెట్టిపేట గ్రామ శివారున విద్యుత్ ప్లాంట్ వద్ద ఆదివారం గాడి వెంకటేశ్వరరావు(77)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్సై పరమహంస కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఆవుల తరలింపు

రాజమహేంద్రవరం రూరల్: అక్రమంగా 50 ఆవులను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మూరు ఎస్సై అంకారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అటుగా వెళుతున్న వ్యాన్‌ను పరిశీలించగా, దానిలో 50 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను గోశాలకు తరలించారు.

సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి


విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేవలం 28 రోజులు మాత్రమే సమయం ఉందని, దీన్ని చక్కగా వినియోగించుకున్నవారే విజేతలుగా నిలుస్తారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ జరిగిన అన్ని పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని, ఉపాధ్యాయులతో సందేహ నివృత్తి చేసుకుని నూరు శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ 28 రోజులూ ఆటపాటలకు, సామాజిక మాధ్యమాల్లో చాటింగ్‌లకు స్వస్తి పలకాలన్నారు. నిరంతరం చదువుకే సమయాన్ని వెచ్చించాలని, అదే సమయంలో ఆరోగ్యంపై కూడా అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. సెలవుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు జి.అప్పారావు, కన్నమ దొర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు


క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. యర్రవరం నుంచి ప్రత్తిపాడు వస్తున్న ఆటోను కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే... రంగంపేటకు చెందిన ఆటో డ్రైవర్ శివమణికంఠ జగ్గంపేట నుంచి ప్రత్తిపాడు వస్తున్నాడు. ఈ ఆటోలో అనకాపల్లి జిల్లా పాయకరావు పేటకు చెందిన షేక్ అబ్బాస్, ఏలేశ్వరం మండలం చిన్నింపేటకు చెందిన శేషమ్మ ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిపై స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద ఆటో రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి పశివేదల వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న షేక్ అబ్బాస్, శివమణికంఠ, శేషమ్మలు, కారులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన వీరవెంకట సత్యనారాయణ, పద్మావతి, హేమలతలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. క్షతగాత్రులకు సీహెచ్‌సీ వైద్యుడు రఘురాం చికిత్స చేసి పోలీస్‌లకు సమాచారం అందించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.